క్లుప్తంగా

పాఠశాల టాపర్లకు ప్రోత్సాహకం అందజేత

జక్రాన్‌పల్లి : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ ఎస్‌లో గోర్తీ ఈశ్వర ట్రస్టు ఉషా బాలా పవన్ కుమార్ దంపతుల ఆర్థిక సహాయంతో పాఠశాల టాపర్లకు నగదు ప్రోత్సాహకం అందజేశారు. ట్రస్టు బాధ్యుడు తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల టాపర్లు గణేష్, వైష్ణవి, నికి తలకు ఒక్కరికి రూ.15 వేల చొప్పున మొత్తం రూ.45 వేల ఆర్థిక సహాయాన్ని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అసిస్టెంట్ అధికారి రాజా గంగారం చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు నల్ల దినేష్ రెడ్డి , స్థానిక ప్రధానోపాధ్యాయుడు లింగన్న, మండల ఎంఈవో శ్రీనివాస్ , ఉపాధ్యాయ బందం విద్యార్థులు పాల్గొన్నారు.

టీసీ సబ్మిట్ గడువు పెంచాలి

తెయూ(డిచ్‌పల్లి): తెయూలో లా సెట్, సీపీగెట్ కౌన్సిలింగ్ ద్వారా ప్రవేశాలు పొందిన విద్యార్థులు రిపోర్టింగ్ చేసినప్పుడు టీసీ అందజేయడానికి తగినంత గడువు ఇవ్వాలని తెయూ ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ కోరారు. ఈ మేరకు మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో వీసీ యాదగిరిరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ.. లాసెట్, సీపీగెట్ కౌన్సిలింగ్‌లో అడ్మిషన్స్ పొందిన విద్యార్థులు వివిధ కారణాల వల్ల టీసీ సబ్మిట్ చేయలేక పోతున్నారని అన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని టీసీ గడువు పెంచాలని కోరారు. వీసీని కలిసిన వారిలో ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అమృత్ చారి, యూనివర్సిటీ అధ్యక్షుడు పృథ్వీ, కార్యదర్శి సమీర్, అశోక్, మహర్షి పాల్గొన్నారు.

జాతీయస్థాయికి ఎంపిక


అప్సర్


ఐశ్వర్య

నిజామాబాద్‌నాగారం : జూనియర్ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌కు జిల్లాకు చెందిన అప్సర్, ఐశ్వర్యలు ఎంపికయ్యారని రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు రాజేందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ నెల 2 నుంచి 9వరకు పంజాబ్‌లోని లూధియానాలో జరిగే జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా వీరిని కోచ్ బొబ్బిలి నరేశ్ ప్రత్యేకంగా అభినందించారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

సిరికొండ: మండలంలోని గడ్కోల్ గ్రామంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను డీసీసీ ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్ రెడ్డి పంపిణీ చేశారు. మొదటి విడతగా 41 ఇళ్ల ఎమ్మెల్యే భూపతిరెడ్డి మంజూరు చేశారని ఆయన తెలిపారు. గ్రామంలో కప్పలవాగు వరదతో దెబ్బతిన్న పంటలను, ఇండ్లను ఆయన పరిశీలించారు. ముషీర్‌నగర్ గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో సామగ్రి దహనమైన బాధితుడికి రూ. 5 వేలు, 25 కిలోల బియ్యం అందజేశారు. భానుచందర్, ఏఎంసీ డైరెక్టర్ సంపత్, మాజీ ఎంపీటీసీ లింబాద్రి, కలిగోట నర్సారెడ్డి, సంతోష్‌నాయక్, కోచర్ గంగారెడ్డి, హేమంత్, భాస్కర్, సొసైటీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, జేసీ బాలయ్య, శ్రీధర్, కిషోర్‌గౌడ్, బుచ్చన్న, గౌసొద్దీన్, జీవన్‌నాయక్, మోజీరాం, సంతోష్‌నాయక్ పాల్గొన్నారు.

నిరక్షరాస్యులకు చదువు నేర్పాలి

డిచ్‌పల్లి: జాతీయ విద్యావిధానం -2020 కి అనుగుణంగా కేంద్రప్రభుత్వం నవభారత్ సాక్షరత కార్యక్రమంలో భాగంగా ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) ను రూపొందించినట్లు ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నవభారత్ సాక్షరత లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని ఉర్దూమీడియం ఉన్నత పాఠశాలలో వీవోలు, సీసీలు, ఎంపిక చేసిన టీచర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడారు. డీసీఈబీ సెక్రటరీ సీతయ్య, తదితరులున్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	107,300	వెండి(కిలో)	1,29,000
22 క్యారెట్స్	99,067	- నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	24	48	గాజరుగడ్డ	30	60
బెండకాయ	30	60	పచ్చిమిర్చి	30	60
బీరకాయ	50	100	దోసకాయ	15	30
దొండకాయ	30	60	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	70	140	గోబిగడ్డ	15	30
కాకరకాయ	25	50	గోబిపువ్వు	25	50
వంకాయ	40	80	బీట్‌రూట్	25	50
పాలకూర	50	100	కరివేపాకు	40	80
మెంతికూర	70	120	చామగడ్డ	30	60
కొత్తిమీర	40	80	చిక్కుడుకాయ	60	100
పుదీనా	50	100	గోరుచిక్కుడు	40	80
క్యాప్సికం	40	80			

-సుభాష్‌నగర్

లక్షలు వెచ్చించి.. లక్షణంగా వదిలేశారు

- నగరంలో పలు కూడళ్ల వద్ద నిరుపయోగంగా బస్‌షెల్టర్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- వినియోగంలోకి తీసుకురావాలని వినతి


ఎన్టీఆర్ చౌరస్తా వద్ద నిరుపయోగంగా ఉన్న బస్‌షెల్టర్


ఎన్టీఆర్ చౌరస్తా వద్ద రోడ్డుపై ప్రయాణికులు

ఖలీల్‌వాడి : నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లడానికి ప్రధాన కూడళ్ల వద్ద బస్‌షెల్టర్లును ఏర్పాటు చేశారు. 2011లో అప్పటి కలెక్టర్ వరప్రసాద్ నగరంలోని ప్రధానంగా ప్రయాణికులు ఉండే ప్రాంతాల వద్ద బస్‌షెల్టర్లు ఏర్పాటు చేసిన నిరుపయోగంగా మారాయి. ఎండ, వాన కాలాల్లో రోడ్డుమీద నిలబడి బస్సు కోసం ప్రయాణికులు నిరీక్షిస్తున్నారు. రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన బస్‌షెల్టర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్సులు ఆపకపోవడంతో..

బస్‌షెల్టర్ వద్ద ఆర్టీసీ బస్సులు ఆపకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో బస్సులు ఆగిన చోటకు వెళ్లి ప్రయాణికులు వేచి ఉంటున్నారు. బస్‌షెల్టర్స్ వద్ద బస్సులను ఆపితే ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవని, ప్రమాదాలు నివారించే అవకాశం ఉంటుంది. దీంతో పాటు ప్రయాణికులకు అనువుగా ఉంటుంది. అధికారులు స్పందించి బస్‌షెల్టర్ల వద్ద బస్సులు ఆపేందుకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్‌షెల్టర్‌ల వద్ద బస్సులు ఆపాలి



బస్‌షెల్టర్ల వద్ద బస్సులు ఆపితే ప్రయాణికులకు ఇబ్బందులు ఉండవు. వర్షం, ఎండకు బస్‌షెల్టర్ కింద ఉండవచ్చు. బస్సులు నిలపకపోవడం నిరుపయోగంగా మారాయి. వీటిని ఉపయోగంలోకి తీసుకురావాలి. దీంతో ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాలు తప్పుతాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సునీల్, గాయత్రినగర్, నిజామాబాద్

బాధితులకు సరుకుల పంపిణీ


వాడిలో సామగ్రి కిట్లను పంపిణీ చేస్తున్న శ్రీకృష్ణ ఫౌండేషన్ సభ్యులు


కొండూర్‌లో దుప్పట్లు అందిస్తున్న భాస్కర్‌రెడ్డి

సిరికొండ: మండలంలోని కొండూర్, గడ్కోల్‌లో వరద బాధితులకు దాతలు అందజేసిన బియ్యం, సరుకులను మంగళవారం పంపిణీ చేశారు. కొండూర్ గ్రామానికి చెందిన నర్మల భాస్కర్‌రెడ్డి బాధితులకు 50 దుప్పట్లను అందించారు. పెద్దవాల్గోట్ గ్రామంలో బాధితులకు సర్పల్లి తండా మాజీ సర్పంచ్ వసంతచందర్‌నాయక్ ట్యాంకర్ ద్వారా నీళ్లను సరఫరా చేస్తున్నారు.

ధర్పల్లి: వరదలతో ముంపుకు గురైన మండలంలోని వాడి, బీరప్ప తండాలో శ్రీకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 36 మంది వరద బాధిత కుటుంబాలకు నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజేష్ గుప్తా, సురేష్, పవన్ , విజయ్, బాలకృష్ణ తదితరులున్నారు.

అసమానతలను తొలగించడమే లక్ష్యం

నిజామాబాద్‌అర్బన్ : విద్యారంగంలో అసమానతలను తొలగించడమే భారత ప్రజాతంత్ర విద్యార్థి సంఘం లక్ష్యమని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని తక్షణమే ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు.


సంఘంలో చేరిన రాథోడ్ జీవన్

భారత ప్రజాతంత్ర విద్యార్థి సంఘంలో లంబాడి స్టూడెంట్ యూనియన్ జిల్లా నాయకుడు రాథోడ్ జీవన్ చేరారు. విద్యార్థి సమస్యలపై పోరాటం నచ్చి ఈ సంఘంలో చేరుతున్నట్లు రాథోడ్ జీవన్ పేర్కొన్నారు. నాయకులు విఘ్నేష్, నితిన్, మహేష్, ప్రవీణ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కుట్రలో భాగమే సీబీఐ దర్యాప్తు

- బీఆర్‌ఎస్‌పై తప్పుడు ప్రచారం
- మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్


డిచ్‌పల్లిలో రాస్తారోకో చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

డిచ్‌పల్లి: కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ దర్యాప్తుకు ఆదేశించడం కాంగ్రెస్ పార్టీ కుట్రలో భాగమేనని రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. మంగళవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో, నిరసన ధర్నా నిర్వహించారు. డిచ్‌పల్లి- నిజామాబాద్ ప్రధాన రహదారిపై బైఠాయించి కాంగ్రెస్ పార్టీకి, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమవుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం బీఆర్‌ఎస్‌పై తప్పుడు ప్రచారం చేస్తుందని విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్, కేసీఆర్‌ను అపవాదులపాలు చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ ఎస్ పార్టీ రూరల్ ఇన్‌చార్జీ మాజీ జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ సాంబరి మోహన్, సీనియర్ నాయకులు నల్లవెల్లి సాయిలు, శక్కరికొండ కృష్ణ, ఒడ్డెం నర్సయ్య, గజవాడ జైపాల్, సీరడి పద్మారావు, చింత మహేశ్, రాజు, మొచ్చె శ్రీను, కిషోర్, దీకొండ శ్రీను, తోట రాజన్న, ఫిలిప్స్, గీత, మహిపాల్, కుమార్, నడిపన్న, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

సిరికొండ: మండలంలోని ముషీర్‌నగర్ గ్రామానికి చెందిన బట్టు గోపాల్ కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ ఎస్‌లో చేరారు. జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆయనకు కండువా వేశారు. పార్టీ రూరల్ ఇన్‌చార్జి బాజిరెడ్డి జగన్, ఆకుల తిర్మల్, రాజు, కైలాస్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎంబీఏ కోర్సును రెగ్యులర్ చేయాలి


వీసీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ (ఐఎంబీఏ)ను రెగ్యులర్ కోర్సుగా మార్చాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం తెయూ వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులు అధికంగా ఉంటే తెయూలో రెగ్యులర్ కోర్సును సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుగా మార్చటంతో వారిపై అదనపు ఆర్థిక భారం వేయడమేనన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్‌కోర్సు చేయడంతో అడ్మిషన్స్ తగ్గిపోయేలా చూసి కోర్సులను ఎత్తివేసే కుట్ర అని విమర్శించారు. విద్యార్థులకు సకాలంలో ట్యూషన్ ఫీజు, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని, పీజీ ఇంటిగ్రేటెడ్ విద్యార్థులకు నెలకు రూ.3వేల స్టైఫండ్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెయూ పీడీఎస్‌యూ నాయకులు ప్రిన్స్ దేవిక, గౌతంరాజ్, బిందు, భారత్, అక్షయ్ తదితదిరులు పాల్గొన్నారు.

జనహృదయ నేత వైఎస్సార్

- రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి
- పలుచోట్ల వైఎస్సార్‌కు నివాళులు అర్పించిన నాయకులు


క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి


కాంగ్రెస్ భవన్‌లో వైఎస్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

డిచ్‌పల్లి/సిరికొండ: : ఉమ్మడి ఏపీ దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి అన్నారు. మంగళవారం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా రూరల్ క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం అమలు చేసిన కార్యక్రమాలతో పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా జనహృదయాల్లో నిలిచిన మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని అన్నారు. జలయజ్ఞం పథకం ద్వారా రైతులకు సాగునీరు, సాగుకు 9 గంటల ఉచిత కరెంట్ పథకాలతో ప్రతి కుటుంబం ప్రయోజనం పొందిందన్నారు. నిజామాబాద్ జిల్లాలో మెడికల్ కాలేజ్, తెలంగాణ యూనివర్సిటీ, ఎత్తిపోతల పథకాలు వైఎస్సార్ హయాంలో వచ్చినవేనని గుర్తు చేశారు. జిల్లాకు నిజాంసాగర్ నుంచి గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతలు, బర్ధిపూర్ ఎత్తిపోతల పథకం ద్వారా సాగు నీళ్లు వచ్చాయన్నారు. 90 వేల ఎకరాల పంట భూములకు నీళ్లను తీసుకొచ్చిన ఘనత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కే దక్కుతుందన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేక పోయిందని విమర్శించారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాలకు పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, డిచ్‌పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, బాల్‌రాజ్, డీసీసీ డెలిగేట్స్ దర్మాగౌడ్, వాసుబాబు, శ్యాంసన్, రూరల్ యూత్ నాయకులు ఉమ్మాజీ నరేష్, సొసైటీ చైర్మన్ రామకృష్ణ, ఏఎంసీ డైరెక్టర్లు నరేందర్, రాజలింగం, గంగారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు మురళి, ఎర్రన్న, రమేష్, హన్మాండ్లు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ మండలంలో..

సిరికొండ మండల కేంద్రంతో పాటు చీమన్‌పల్లి గ్రామంలో నాయకులు వైఎస్సార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మార చంద్రమోహన్, డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు బాకారం రవి, ఎర్రన్న, సొసైటీ చైర్మన్ గంగాధర్, దేగాం సాయన్న, దిగంబర్, రమేష్, సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. డిచ్‌పల్లిలోని 'సాక్షి' యూనిట్ కార్యాలయంలో వైఎస్సార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నిజామాబాద్ సిటీ: ఉమ్మడి ఏపీ దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి 16వ వర్ధంతిని జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా నగర కాంగ్రెస్ నాయకుడు, నుడా చైర్మన్ కేశ వేణు వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేశ వేణు మాట్లాడుతూ ఏకకాలంలో రైతు రుణమాఫీ చేసిన గొప్ప నాయకుడు వైఎస్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్, నాయకులు సేవాదళ్ సంతోష్, మహ్మద్ ఖుద్దూస్, సుమేర్ అహ్మద్, రాజేంద్రప్రసాద్, ప్రమోద్, కొండపాక రాజేష్, పుప్పాల విజయ తదితరులు పాల్గొన్నారు.


సిరికొండలో..


చీమన్‌పల్లిలో..


సాక్షి యూనిట్ కార్యాలయంలో..

వినాయక మండపాల్లో పూజలు, అన్నదానాలు


దుబ్బలో శివశక్తి గణేశ్ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు


పూజలు చేస్తున్న కమాండెంట్ దంపతులు


కలెక్టరేట్‌లో పూజలు చేస్తున్న ఉద్యోగినులు

నిజామాబాద్ రూరల్/డిచ్‌పల్లి/ నిజామాబాద్ అర్బన్ : నగరంలో వినాయక మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.ఈసందర్భంగా మండపాల వద్ద నిర్వాహకులు అన్నదానం చేశారు. తెలంగాణ ప్రత్యేక పోలీస్ ఏడవ బెటాలియన్, డిచ్‌పల్లి లో ఏర్పాటు చేసిన వినాయకుడికి మంగళవారం కమాండెంట్ సత్యనారాయణ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హోమం నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు, సిబ్బందితో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు తదితరులు పాల్గొన్నారు. నిజామాబాద్ కలెక్టరేట్‌లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం వద్ద వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చనలో మహిళలు పాల్గొన్నారు.

నిమజ్జనాన్ని శాంతియుతంగా జరుపుకోవాలి

ఇందల్వాయి : గణేశ్ నిమజ్జన ఉత్సవాలపై ఇందల్వాయి పోలీస్ స్టేషన్‌లో డిచ్‌పల్లి సీఐ వినోద్ ఆధ్వర్యంలో ఎస్సై సందీప్ శాంతి కమిటీసభ్యులు, ముస్లిం మత పెద్దలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. నిమజ్జన ఉత్సవాల్లో ఎలాంటి అల్లర్లు, గొడవలు జరగకుండా అందరు కృషి చేయాలని సీఐ సూచించారు. డీజేలు పెట్టవద్దని, అగ్ని ప్రమాదాలు, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా మండపాల నిర్వాహకులు జాగ్రత్తపడాలన్నారు.

శ్రీ ఓం గణేశ్ మండలిలో ..



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లోని శ్రీ ఓం గణేశ్ మండలి వద్ద అన్నదానం చేశారు. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయి చైతన్య మండపంలో పూజలు చేశారు. కార్యక్రమంలో డీసీపీ కిరణ్ కుమార్, జి.బస్వారెడ్డి, మున్సిపల్ కమిషనర్ దినేశ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలు కలిగి ఉండాలి



నిజామాబాద్‌అర్బన్: విద్యార్థులు ఎల్లప్పుడూ వినూత్న ఆలోచనలు కలిగి ఉండాలని గిరిరాజ్ కాలేజీ ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం కళాశాలలో టీఎస్‌కేసీ సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలో 'ఐడియాథాన్' ఆవిష్కరణల కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బాలు ప్రవరాఖ్య విద్యార్థులకు జీవన నైపుణ్యాలను మెరుగుపర్చడం, ఆవిష్కరణ దిశలో ఆలోచించడం అంశాలను వివరించారు. జిల్లాలోని వివిధ ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆవిష్కరణలు తయారు చేశారు. 25 ప్రాజెక్టులు పోటీలో నిలవగా, వాటిలో పదింటిని ఉత్తమమైనవిగా గుర్తించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తలుగా డాక్టర్ పి.ముత్తెన్న, డాక్టర్ పి.రామకృష్ణ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, శ్రీరామ్, సంకీర్త్, టీఎస్ కేసీ మెంటార్ శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన బుక్ ఆఫ్ డిజిటల్ లెర్నింగ్ శిక్షణ

నిజామాబాద్ అర్బన్ : జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బుక్ ఆఫ్ డిజిటల్ లెర్నింగ్ శిక్షణ మంగళవారంతో ముగిసింది. గత మూడు రోజులుగా మాణిక్ బండర్ లోని కాకతీయ ఇంజినీరింగ్ కాలేజీలో కేజీబీవీ, జిల్లా పరిషత్, ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్ పాఠశాల ఉపాధ్యాయులకు ఈ శిక్షణ ఇచ్చారు. రాష్ట్రంలో ఎంపిక చేసిన 41 అటల్ టింకరింగ్ ల్యాబ్ ఉన్న పాఠశాలల నుంచి గణితం, భౌతిక, రసాయన శాస్త్ర ఉపాధ్యాయులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. మోడల్ స్కూల్, కేజీబీవీలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏఐ బేస్డ్ బోధన నిర్వహించేందుకు ఈ శిక్షణలో పలు అంశాలు వెల్లడించారు. 6,7,8,9 తరగతులకు ఏ బుక్ ఆఫ్ డిజిటల్ లెర్నింగ్ సంబంధించిన పుస్తకాలను విద్యార్థులకు అందజేయనున్నారు. వీటికి సంబంధించిన శిక్షణను సంబంధిత ఉపాధ్యాయులకు కొనసాగించారు. ముగింపు రోజు శిక్షణలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ పాల్గొన్నారు. ఏఐ విద్య బోధనకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ బాలకృష్ణ, స్టేట్ రిసోర్స్ పర్సన్ లక్ష్మీనాథం, జిల్లా రిసోర్స్ పర్సన్లు మధు, సాయిలు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

పాఠశాలకు మైక్ సెట్ అందజేత

మోపాల్: మండలంలోని కంజర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పిల్లి భూమేష్ రూ. 25వేల విలువ చేసే మైక్ సెట్, క్రీడా సామగ్రిని మంగళవారం అందజేశారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు గోపాల చారి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో గ్రామస్తుల భాగస్వామ్యం ఉండాలన్నారు. నాయకులు రామర్తి రవి, దేవర జనార్దన్, బున్నె భాస్కర్, మోతె మోహన్, ఉపాధ్యాయులు వెంకట లక్ష్మీ, అరుణ శ్రీ, ఎంఎస్ రాణి, గోపాలకృష్ణ, క్రాంతి కిరణ్, ఉమా గౌరీ, భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్‌లో వలంటీర్ల శ్రమదానం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ -1, యూనిట్ -4 సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం వలంటీర్లు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. క్యాంపస్‌లోని న్యాయ కళాశాల ఆవరణలో శ్రమదానం ద్వారా పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ కే.రవీందర్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు బి.స్రవంతి, స్వప్న, లా కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రసన్న, ఎల్లోసా, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి

డిచ్‌పల్లి: గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 7న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తలపెట్టిన ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జెపి గంగాధర్, జిల్లా అధ్యక్షుడు శ్యాంసన్ పిలుపునిచ్చారు. మంగళవారం డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామంలో పంచాయతీ కార్మికులతో కలిసి రాష్ట్ర సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. గ్రామ పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల వాడకాన్ని అరికట్టాలి

ఖలీల్‌వాడి: నగరంలో మత్తు పదార్థాల వాడకాన్ని అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. మంగళవారం సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు, ఏసీపీలకు వినతిపత్రం అందించారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శిరమేష్ బాబు మాట్లాడుతూ నగరంలో రోజురోజుకు గంజాయి, వైట్నర్, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు వాడకం పెరిగిందన్నారు. రైల్వే స్టేషన్‌తో పాటు నాగారం, బస్టాండ్, ఆటోనగర్, చంద్రశేఖర్ కాలనీ, గౌతమ్ నగర్ తదితర ప్రాంతాల్లో అడ్డాలుగా మార్చుకొని కొంత మంది రౌడీ మూకలు అరాచకాలను కొనసాగిస్తున్నారని ఆరోపించారు.కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, నూర్జహాన్, వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు సుజాత, నగర కమిటీ సభ్యులు కటారి రాములు, శేఖర్ గౌడ్, అంజయ్య పాల్గొన్నారు.

పోస్టల్ సమస్యల పరిష్కారం కోసం డాక్ అదాలత్

నిజామాబాద్ లీగల్: తపాల శాఖ సర్వీసులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సెప్టెంబర్, 24న 51వ పోస్టల్ డాక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు, నిజామాబాద్ పోస్టల్ సీనియర్ సూపరింటెండెంట్ కే. జనార్దన్ రెడ్డి తెలిపారు. పోస్టల్ సర్వీసులకు సంబంధించిన ఫిర్యాదులపై ప్రజలు ఈ నెల 8వ తేదిలోపు పోస్టల్ ఎన్వలప్ లేద కవర్ పై 51వ డాక్ అదాలత్ అని రాసి కే. శ్రీకాంత్, అసిస్టెంట్ డైరెక్టర్ (స్టాఫ్ అండ్ విజిలెన్స్), ఆఫీస్ ఆఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్, హైదరాబాద్ రీజియన్, హైదరాబాద్-500001 చిరునామాకు పంపాలని జనార్దన్ రెడ్డి తెలిపారు. ఫిర్యాదుతో పాటు వినియోగదారులు తమ అడ్రస్ తో పాటు ఫోన్ నెంబర్, ఈ-మెయిల్ ఐడీ తప్పకుండా రాయాలని ఆయన సూచించారు.